## నెక్కొండ హైస్కూల్ విద్యార్థి ప్రతిభ

నిఖిల్‌వర్మ

నెక్కొండ, జూన్ 4: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి భట్టు నిఖిల్ వర్మ ఐఐటీ మాద్రాసులో బుధవారం నిర్వహించనున్న ఎస్‌జేడబ్ల్యూపీ ఫైనల్ పోటీలకు ఎంపికయ్యాడు. దేశంలోని 400 మంది విద్యార్థులు పోటీపడగా తొలిరౌండ్‌లో 25 మంది ఎంపికయ్యారు. రెండో విడతలో 25 మంది పోటీపడగా పదిమందిని ఎంపిక చేశారు. అందులో నిఖిల్‌వర్మ కూడా ఉన్నాడు. ఈ పోటీల్లో నిఖిల్‌వర్మ సత్తా చాటితే ఆగస్టు 24 నుంచి 29 వరకు స్టాక్‌హోమ్‌లో జరుగనున్న పోటీలకు భారత్ తరపున పాల్గొనే అరుదైన అవకాశం దక్కనుంది. విద్యార్థికి హైస్కూల్ గెజిటెడ్ హెచ్ఎం ఎం.రంగారావు, గైడ్ టీచర్ పూస కిశోర్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఐనవోలు విద్యార్థికి పాలిసెట్ 521 ర్యాంక్

కార్తీక్

ఐనవోలు, జూన్ 4: మండలకేంద్రానికి అమరవారి స్వప్న, వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడు కార్తీక్ సోమవారం విడుదలైన పాలిసెట్‌లో స్టేట్‌లో 521 ర్యాంక్ సాధించాడు. ఎంపీసీలో స్టేట్ 521 ర్యాంక్, అలాగే ఎంబీఐపీసీలో స్టేట్ 858 ర్యాంక్ సాధించాడు. కార్తీక్ గతంలో విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో సీట్ సాధించి పదో తరగతి పూర్తి చేశాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో గ్రామస్తులు మంగళవారం అభినందించారు.

## ఎంపీ కడియం కావ్యకు శుభాకాంక్షలు

గిర్మాజీపేట, జూన్ 4 : వరంగల్ ఎంపీగా విజయం సాధించిన కడియం కావ్యను మాజీ మేయర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

కొడకండ్ల, జూన్ 4 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన ఘటనలో వరంగల్ నగరానికి చెందిన పుల్లూరు గోవింద్‌రాజ్‌పై పోలీసులు నమోదు చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువతిని మోసగించిన గోవిందరాజ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎవరైనా ఆడపిల్లలతో ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729
WANTED FEMALE TELECALLERS
★Urgent Requirement for ICICI, HDFC Bank Personal Loans Fresher Female Tele-Callers, Vacancies: 40, Sal+Inc. etc.., Job Location: HNK, Cont: 8886188690.
NTW-5697
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఎనుమాముల మార్కెట్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ

## ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన సీపీ

సుబేదారి, జూన్ 4: వరంగల్ ఎనుమముల మార్కెట్‌లో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా మంగళవారం పరిశీలించారు. పోలీస్ బందోబస్తు పర్యవేక్షించారు. సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ఫలితాలను వీక్షిస్తున్న ప్రజలు

## పబ్లిక్‌గార్డెన్‌లో ఎన్నికల ఫలితాల వీక్షణ

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రజలు వీక్షించారు. ఈసీఐ నుంచి నేరుగా ప్రసారం చేయగా స్క్రీన్‌పై తెలంగాణతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.

అతిథి మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఆర్థికసాయం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ యూత్ నాయకులు

## ఘనంగా ఈస్ట్‌జోన్ డీసీపీ బర్త్‌డే వేడుకలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: ఈస్ట్‌జోన్ డీసీపీ, ఐపీఎస్ అధికారి రావుల గిరిధర్ జన్మదిన వేడుకలను విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ కేయూ రోడ్‌లోని అతిథి మానసిక దివ్యాంగుల కేంద్రంలో నిర్వహించారు. పండ్లు పంపిణీ చేసి, అన్నదానం కోసం ఆర్థికసాయం అందజేశారు. అసోసియేషన్ నాయకులు పెద్దోజు వెంకటాచారి, రామాచారి, నారాయణగిరి రాజు పాల్గొన్నారు. పెద్దోజు వెంకటాచారి 35వ సారి ఎంజీఎం దవాఖానలో రక్తదానం చేశారు.

# పెళ్లయిన నెలకే..

- అనస్థీషియా టెక్నీషియన్ మృతి
- ఫుడ్ పాయిజన్‌తో దవాఖానపాలు
- చికిత్స పొందుతూ మృతి
- గ్రామంలో విషాదఛాయలు

ప్రణయ్‌కుమార్(ఫైల్)

నల్లబెల్లి, జూన్ 4 : ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతూ అనస్థీషియా టెక్నీషియన్ మృతి చెందిన ఘటన నల్లబెల్లిలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కొత్తపెల్లి కోటిలింగాచారి ఏకైక కుమారుడు ప్రణయ్(26) వరంగల్ ములుగురోడ్డులోని అజర హాస్పిటల్‌లో అనస్థీషియా టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. తాను పని చేస్తున్న దవాఖానలోనే నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న యువతిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారం రోజుల క్రితం ప్రణయ్ ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రెండు సమోసాలు తిన్నాడు. కొద్దిసేపటికి వాంతులు, విరోచనాలు కావడంతో తాను పని చేస్తున్న అజర హాస్పిటల్‌లోనే చికిత్స కోసం చేరాడు. ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యసేవల కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం ప్రణయ్ మృతి చెందాడు. వివాహం జరిగి కనీసం నెల రోజులైనా కాకముందే కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అందరితో కలివిడిగా ఉండే ప్రణయ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ప్రణయ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

# నేడు, రేపు ఐసెట్

- దరఖాస్తు చేసుకున్న 86,514 అభ్యర్థులు
- వరంగల్, నర్సంపేట రీజియన్‌లో 8 పరీక్షా కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ నర్సింహాచారి

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఐ సెట్ 5, 6న నిర్వహించనున్నట్లు ఐ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో జరిగే టీజీఐసెట్-2024కు మొత్తం రెండు తెలుగు రాష్ట్రాల్లో 86,514 మంది అభ్యర్థులు పరీక్షకు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు మళ్లీ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మూడు సెషన్స్ ఉంటాయని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించేది లేదని తెలిపారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో మొత్తం 8 పరీక్ష కేంద్రాల్లో మూడు సెషన్లలో 4,659 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. నర్సంపేట్ జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, వరంగల్, హనుమకొండలో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, వశిష్ట టెక్నాలజీస్, తాళ్ల పద్మావతి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, బొల్లికుంట, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ, కిషన్‌పురా, నోబెల్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ చింతగట్టు, హసన్‌పర్తి ఉన్నాయని వివరించారు.

## రాఘవపూర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

కాజీపేట, జూన్ 4: కాజీపేట రైల్వే జంక్షన్-బల్లార్ష సెక్షన్‌లోని రాఘవపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో కొద్ది సమయం వరకు రైళ్ల రాకపోకలు అంతరాయం కలిగి ఎక్కడి రైళ్లు అక్కడే నిలిచాయి. పట్టాలు తప్పిన గూడ్స్ రైలు బోగీలను తిరిగి పట్టాలపై సరిచేసేందుకు సిబ్బంది కాజీపేట రైల్వే జంక్షన్ బ్రేక్ డౌన్ వ్యాన్ రైలులో తరలివెళ్లారు. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టి గూడ్స్ రైలు బోగీలను తిరిగి పట్టాలపై యథాస్థానంలో ఏర్పాటు చేసి, లైన్ క్లియర్ చేశారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

చెన్నారావుపేట, జూన్ 4: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన జల్లిలో మంగళవారం జరిగింది. గ్రామంలో రైతు మంద రమేశ్‌కు చెందిన పాడి గేదె శివారులోని బంధంకుంట చెరువు పక్కన మేస్తుండగా కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

రుద్రహోమంలో పాల్గొన్న ఈవో, అర్చకులు, భక్తులు

## ఐలోని మల్లన్నకు ప్రత్యేక పూజలు

ఐనవోలు, జూన్ 4: ఐలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజాలు, అర్చనలు, అభిషేకాలు, ఒగ్గు పూజాలరులు స్వామి వారికి మేలుకొలుపు నిర్వహించారు. అనంతరం ఒగ్గుపూజారులు ఆలయ ముఖ మండపంలో పెద్దపట్నం వేసి సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, గట్టు పురుషోత్తమశర్మ పాల్గొన్నారు.

# వాగుపై బ్రిడ్జి నిర్మించడి సారూ..

- పాపయ్యపేట రైతుల వేడుకోలు
- ధాన్యం తరలించేందుకు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు

బురదలో నుంచి ట్రాక్టర్లను బయటకు తీసేందుకు అవస్థలు పడుతున్న రైతులు

చెన్నారావుపేట, జూన్ 4 : పాపయ్యపేట గ్రామానికి చెందిన రైతులు పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. ధాన్యాన్ని తరలించేందుకు సరైన మార్గం లేక పొలాల నుంచి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్లు బురదలో చిక్కుకుపోతుండడంతో వాటిని తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. చెన్నారావుపేట-రంగాపురం మధ్యలో పాకాల వాగుపై వంతెన నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చెక్‌డ్యాం కమ్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగిపోయాయి. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జిని నిర్మించాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# శాయంపేటలో కోతులు, కుక్కల బెడద

- దాడుల్లో గాయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

శాయంపేట, జూన్ 4 : మండలంలోని పలు గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కలు జనం మీద పడి కరుస్తున్నాయి. కోతులు వందల సంఖ్యలో ఉండగా ఇళ్ల పైకప్పులను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి చేతికి దొరికింది ఎత్తుకెళ్తున్నాయి. అడ్డు వచ్చిన పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయాలైన వారు స్థానిక ప్రభుత్వ దవాఖానకు పెద్ద సంఖ్యలో వస్తుండడమే నిదర్శనం. నెలకు సుమారు 200 మందికి పైగా కోతుల దాడిలో గాయపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పత్తిపాకలో రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని కోతుల గుంపు తరమడంతో రోడ్డుపై పడి తలపగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కోతుల బెడదను తొలగించాల్సిన గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం కుక్క స్వైర విహారం చేసి 14 మందిని కరిచింది. రోడ్డుపై వెళ్తున్న వృద్ధులు, మహిళలు, యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారు ఎంజీఎం దవాఖానలో వైద్యం పొందారు. కుక్కల దాడిలో నెలలో సుమారు 200కు పైగా బాధితులు శాయంపేట ప్రభుత్వ దవాఖానకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా కుక్కల బెడదను తొలగించాల్సిన గ్రామపంచాయతీ కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 14మందిపై దాడి చేసిన కుక్కను గ్రామపంచాయతీ సిబ్బంది, జనం వెంబడించి కొట్టి చంపారు. శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో పిల్లలు, పెద్దలు ద్విచక్రవాహనాలు వెళ్తుంటే వెంబడిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఓవైపు కోతులు, మరోవైపు కుక్కలతో రోడ్డుపై నడవలేని పరిస్థితి ఉంది. గ్రామపంచాయతీ అధికారులు ఇప్పటికైనా కోతులు, కుక్కల బెడద తొలగించి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# సమస్యల వలయంలో 13వ డివిజన్

- జీడబ్ల్యూఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు
- వర్షాకాలంలో పరిస్థితి మరీ అధ్వానం

కాశీబుగ్గ, జూన్ 4: గ్రేటర్ వరంగల్‌లోని 13వ డివిజన్ సమస్యలకు నిలయంగా మారింది. వర్షాకాలం ముందు పెద్ద నాలాల్లో (బాక్స్ డ్రైనేజీలు) గ్యాంగ్ వర్క్స్ చేయడం లేదు. స్లమ్ ఏరియాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు సక్రమంగా పని చేయడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చిన్నవడ్డేపల్లి చెరువు కట్ట కింద 40 ఫీట్ల రోడ్డును ఆక్రమించి చాలామంది ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. 40 ఫీట్ల రోడ్డు కాస్త 20 ఫీట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నవడ్డేపల్లి చెరువు చెత్తా చెదారంతోపాటు గుర్రపు డెక్కతో నిండిపోయింది. వర్షాకాలంలో డివిజన్ పరిస్థితి అధ్వానంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా మారిన డ్రైనేజీ

నిరుపయోగంగా ఉన్న బోరింగ్

కాలనీలో ఏర్పడిన లీకేజీలు

గుర్రపు డెక్కతో నిండిన చిన్నవడ్డేపల్లి చెరువు

### అధికారులు పట్టించుకోవడం లేదు

సమస్యలను వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నా మాటలను బేఖాతర్ చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులు చూడలేకపోతున్నా. జనాల ముందు తలెత్తుకునే పరిస్థితి లేదు. డివిజన్‌లోని మెయిన్‌రోడ్డుతోపాటు కాలనీల్లో పైపులైన్ లీకేజీలు ఏర్పడ్డాయి. ఆరు నెలలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా. మీటింగ్‌ల పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారు.

– సురేశ్ జోషి, 13వ డివిజన్ కార్పొరేటర్

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

## నీట్‌లో 'షైన్' ప్రభంజనం

హనుమకొండ, జూన్ 4 : నీట్-2024 ఎంట్రెన్స్ ఫలితాల్లో 'షైన్' విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు పీ రాజేంద్రకుమార్, మూగల రమ, రమేశ్ సంయుక్తంగా తెలిపారు. జాతీయ స్థాయిలో 578 మార్కులతో కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన నీట్-2024 ఎంట్రెన్స్ ఫలితాల్లో షైన్ జూనియర్ కాలేజీ జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి నీట్, జేఈఈ, మెయిన్స్, అడ్వాన్స్‌లలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా ఆణిముత్యాలుగా తీర్చిదిద్ది జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించేలా తయారు చేస్తున్నామని చెప్పారు. కళాశాలలో జాతీయస్థాయిలో 578మార్కులు సాధించిన టీ హోమప్రియ (240410224981)ని అభినందించారు. అలాగే బీ శ్రీపూజ (240411367277) 430 మార్కులు, విద్యశ్రీ (240410473686) 425 మార్కులు, రాయ్ ముస్కాన్ (240410460445) 378 మార్కులు సాధించారని వివరించారు. మరో 20 మంది విద్యార్థులు 300 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు నిరంతర పర్యవేక్షణ, మోటివేషన్‌తో మామూలు విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడంతోనే ఈ విజయాలు సాధించారని పేర్కొన్నారు. ఈ విజయాలకు తోడ్పాటు అందించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మారబోయిన రాజుగౌడ్, కొత్తకొండ శ్రీనివాస్, ప్రవళ్లిక, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన విభాగాధిపతులతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

## కేయూలో విభాగాధిపతుల నియామకం

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: కాకతీయ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల్లో ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు నూతన అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సోషియాలజీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఫిజిక్స్ విభాగాధిపతిగా డాక్టర్ జి.మంజుల, గణితశాస్త్ర విభాగాధిపతిగా డాక్టర్ ఆర్.భారవిశర్మ, బొటనీ విభాగాధిపతిగా డాక్టర్ ఎం.లలితకుమారి, జియాలజీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జునరెడ్డి నియామకమయ్యారు. వీరు ప్రస్తుత విభాగాధిపతుల నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరిని బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

రాజయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సురేశ్‌లాల్, సిబ్బంది

## రిటైర్డ్ ప్రొఫెసర్ రాజయ్యకు నివాళి

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగ విశ్రాంత ప్రొఫెసర్ గుజ్జుల రాజయ్య సోమవారం మధ్యాహ్నం మృతిచెందారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సురేష్‌లాల్ ఆధ్వర్యంలో రాజయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ రాజయ్య అర్థశాస్త్ర విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడిగా, అభివృద్ధి అధికారిగా, యూపీజీసీ ప్రిన్సిపాల్‌గా గతంలో పనిచేశారని క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌లాల్ తెలిపారు. అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులు విద్యాసాగర్, సాంబశివరావు, రాజేశ్, రమేశ్, బోధనేతర సిబ్బంది కొమురమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఆధునిక పరికరాలపై అవగాహన

కాశీబుగ్గ, జూన్ 4: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పరికరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మన అగ్రిటెక్ చైర్మన్ పాశికంటి రమేశ్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పనిముట్లను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని సులభతరం చేసుకొని లాభసాటిగా మార్చుకోవాలని రైతులకు సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సుబేదారి, జూన్ 4: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి పట్టుబడిన 13మంది వాహనదారులకు జరిమానా విధించారు. వారికి రూ.15,700 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

## భూతగాదాలో ఇరువర్గాల ఘర్షణ

### ట్రాక్టర్ ట్రాలీ పడి మహిళ మృతి

రఘునాథపల్లి జూన్ 4 : భూ తగాదాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మహిళ మంగళవారం మృతిచెందింది. పోలీసు కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఆంధ్రాతండాకు చెందిన భూక్యా గణేశ్-మంగమ్మ(40) దంపతులకు గ్రామ శివారులోని గుట్ట సమీపంలో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లడానికి పొత్తుల దారి ఉంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మాలోత్ శివాద్రి, ధరావత్ బీల్యా ట్రాక్టర్ సాయంతో పొత్తుల రోడ్డుకు మంగళవారం మట్టి పోస్తున్నారు. మంగమ్మ అక్కడి వెళ్లి ఇక్కడ ఎందుకు మట్టి పోస్తున్నారని అడ్డు పడింది. దీంతో మట్టి పోస్తున్న బీల్యా కుమారుడు రవీందర్, శివాద్రి, మాలోత్ కాళీ ఆగ్రహంతో మంగమ్మతో గొడవపడి ఆమెను నెట్టేశారు. దీంతో ఆమె కిందపడింది. ఈ సమయంలోనే బీల్యా కుమారుడైన రవీందర్ మట్టిని పోసేందుకుకు ట్రాక్టర్ జాకీని లేపాడు. దీంతో ట్రాక్టర్ ట్రాలీ మంగమ్మ మీద పడి, ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ యాదవ్ తెలిపారు.